క్లుప్తంగా

29న పేరాలగుట్ట వేలంపాట

గాలివీడు : మండలంలోని గోరాన్ చెరువు గ్రామం గేటు కుమ్మరపల్లి వద్ద నున్న పేరాల గుట్ట బండరాళ్ల కంకర రవాణా వాహనముల పై 2025 – 26 సంవత్సరం గాను టోల్ గేటు వసూలుకు బహిరంగ వేలం నిర్వహించుబడునని సర్పంచ్ దీప్తి, పంచాయతీ కార్యదర్శి సరోజమ్మలు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు సంబంధిత ధరావత్తు చెల్లించి వేలం పాటలో పాల్గొనవలసినదిగా, మరిన్ని వివరాలకు గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.

30న పంచాంగ శ్రవణం

రాజంపేట టౌన్ : ఈనెల 30వ తేదీ ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని రాజంపేట పట్టణం మెయిన్ రోడ్డులో ఉన్న ఆంజనేయ స్వామి ఆలయంలో సాయంత్రం 6 గంటల నుంచి పంచాంగ శ్రవణం కార్యక్రమం ఉంటుందని టీటీడీ జిల్లా ప్రోగ్రాం అసిస్టెంట్ టి.గోపిబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుమల – తిరుపతి దేవస్థానములు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ అన్నమయ్య జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. వేదపండితులు యతిరాజం హరినాథ్ పంచాంగ శ్రవణాన్ని, అలాగే ధర్మాచార్యులు గంగనపల్లి వెంకటరమణ ఉగాది ప్రాశస్త్యాన్ని తెలియజేస్తారన్నారు. అనంతరం ప్రసాదాన్ని పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ప్రజలు పెద్దఎత్తున పాల్గొనాలని తెలిపారు.

వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడిగా మిట్టపల్లి



మిట్టపల్లి యదుభూషణ్‌రెడ్డి

గాలివీడు : వైఎస్సార్సీపీ మండల అధ్యక్షుడిగా తనను నియమించినట్లు మిట్టపల్లి యదుభూషణ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన మీద విశ్వాసంతో మండల అధ్యక్ష పదవికి ఎంపిక చేయడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఇందుకు కారకులైన వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డి, వైఎస్సార్సీపీ అధికార ప్రతినిధి ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలియజేశారు. మండలంలో పార్టీ బలోపేతానికి అందరిని కలుపుకుని పని చేస్తానని చెప్పారు.

నవోదయకు విద్యార్థి ఎంపిక



హేమంత్

ఓబులవారిపల్లె : మంగంపేట ఏపీఎండీసీ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న హేమంత్ అనే విద్యార్థి జవహర్ నవోదయ విద్యాలయానికి ఎంపికయ్యాడు. ఇటీవలే తొమ్మిదవ తరగతి ప్రవేశానికి నిర్వహించిన పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాడు. నవోదయ విద్యాలయానికి ఎంపిక కావడం పట్ల హేమంత్‌ను పాఠశాల యాజమాన్యం, గ్రామస్తులు అభినందించారు.

మైసూరావారిపల్లి ఈద్గాలోనే రంజాన్ ప్రార్థనలు

రైల్వేకోడూరు అర్బన్ : రాబోయే రంజాన్ ప్రార్థనలు మైసూరావారిపల్లి పంచాయతీలోని నూతన ఈద్గా మైదానంలోనే జరుగుతాయని జామియా మసీద్ కమిటీ సభ్యులు తెలిపారు. గురువారం ఈద్గా మైదానాన్ని పరిశీలించి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రంజాన్ పవిత్రదినాన ముస్లింలు ప్రార్థనలు చేసుకోవడానికి అన్ని ఏర్పాట్లు చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ముజీబ్, పఠాన్ మౌలా, కరీముల్లా, షబ్బీర్, సాదిక్ వలీ తదితరులు పాల్గొన్నారు.

సాల్ట్ లిక్స్ ఏర్పాటు

సిద్దవటం : సిద్దవటం అటవీ రేంజ్‌లో వన్యప్రాణుల కోసం సాల్ట్ లిక్స్‌లను ఏర్పాటు చేశామని రేంజర్ కళావతి తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆమె మాట్లాడుతూ కడప డీఎఫ్‌ఓ వినీత్‌కుమార్ ఆదేశాల మేరకు సిద్దవటం రేంజ్‌లోని అన్నీ బీట్‌లలో వన్యప్రాణులకు నీటి కొరత, ఆహార కొరతను కొంత వరకు తగ్గించేందుకు 200 పైగా సాల్ట్ లిక్స్‌లను(ఉప్పు గడ్డలు) ఏర్పాటు చేయించినట్లు పేర్కొన్నారు.

ఎంపీ నిధులతో సీసీ రోడ్డు పనులు

పుల్లంపేట : రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి సహకారంతో రూ.9 లక్షలు నిధులతో గురువారం పుల్లంపేటలోని శివాలయం వీధిలో వైఎస్సార్‌సీపీ నాయకులు బోగా పార్థసారథి సిమెంట్ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ పనులను ఆర్ అండ్ బీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామచంద్ర నాయక్ తనిఖీ చేశారు. నాణ్యతా ప్రమాణాలతో రోడ్లు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

పుల్లంపేట : మండలంలోని కె.రాచపల్లి మండల ప్రాథమిక పాఠశాలలో గురువారం పాఠశాల వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయురాళ్లు ఉషాకుమారి, రాజకుమారిలు మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా ఎంతో అవసరమన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతో దోహదపడతాయన్నారు. విద్యార్థులు క్రీడల్లో రాణించి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొన్నారు.

ముగిసిన వైస్ ఎంపీపీల ఎన్నిక ప్రక్రియ

- రాయచోటి రూరల్ వైస్ ఎంపీపీగా బోడిరెడ్డి నాగసుబ్బమ్మ
- ప్రలోభాల పర్వంలో ఒంటిమిట్ట వైస్ ఎంపీపీ స్థానం టీడీపీ వశం



రాయచోటి అర్బన్‌: రూరల్ మండల వైస్ ఎంపీపీ ఎన్నిక ఏర్పాట్లను పరిశీలిస్తున్న జేసీ ఆదర్శ్ రాజేంద్రన్

రాయచోటి అర్బన్ : రాయచోటి రూరల్ మండల ఉపాధ్యక్ష పదవిని వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకుంది. గురువారం మండల ఉపాధ్యక్షుడు – 2 పదవికి జరిగిన ఎన్నికలో వైఎస్ఆర్‌సిపి మద్దతుదారురాలైన శిబ్యాల ఎంపీటీసీ సభ్యురాలు బోడిరెడ్డి నాగసుబ్బమ్మ ఎంపీపీ– 2గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గతంలో మండల ఉపాధ్యక్షురాలు – 2గా ఎంపికైన గొర్లముదివేడు ఎంపీటీసీ చంద్రమ్మ కొద్దినెలల క్రితం అనారోగ్యంతో మృతిచెందారు. దీంతో ఖాళీగా ఉన్న వైస్ ఎంపీపీ పదవికి ఎన్నిక అనివార్యమైంది. ఎన్నికల అధికారి డీఎల్‌డీఓ లక్ష్మీపతి గురువారం రాయచోటి ఎంపీడీఓ సభా భవనంలో ఎన్నికను నిర్వహించారు. మండలంలో 10 మంది ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. వీటిలో కాటిమాయకుంట, గొర్లముదివీడు ఎంపీటీసీలు మక్కన్ సాహెబ్, చంద్రమ్మలు మృతిచెందారు. మిగిలిన 8 మంది ఎంపీటీసీలలో కావలి ప్రభాకర్‌రెడ్డి, రామచంద్రా రెడ్డి, గుర్రం చిట్టెమ్మలు గైర్హాజరయ్యారు. దీంతో 5 మంది మాత్రమే ఎన్నిక కార్యక్రమానికి హాజరయ్యారు. సభ్యులలో యండపల్లె ఎంపీటీసీ సభ్యుడు సైకం జయపాల్‌రెడ్డి శిబ్యాల ఎంపీటీసీ సభ్యురాలు బోడిరెడ్డి నాగసుబ్బమ్మ పేరును ప్రతిపాదించగా, శిబ్యాల – 2 ఎంపీటీసీ సభ్యురాలు, ఎంపీపీగా ఉన్న పి.రాజమ్మ బలపరిచారు. మాధవరం–1,2 ఎంపీటీసీ సభ్యులు కసినేని నాగవేణి, సహదేవమ్మలు మద్దతునిచ్చారు. ఇదే సమయంలో మిగిలిన సభ్యులెవరూ పోటీకి సిద్ధపడకపోవడంతో ఎన్నికల అధికారి లక్ష్మీపతి బోడిరెడ్డి నాగసుబ్బమ్మ ఎంపీపీ–2 గా ప్రకటించారు. అనంతరం ఆమెకు నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేష్‌తో పాటు కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు. కాగా అంతకుముందు ఎన్నికల ఏర్పాట్లను జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ పరిశీలించారు.

ఒంటిమిట్ట వైస్ ఎంపీపీ ఎన్నికలో హైడ్రామా

ఒంటిమిట్ట : మండల వైస్ ఎంపీపీ ఎన్నిక హైడ్రామాను తలపించింది. గురువారం ఉదయం మండల కేంద్రంలోని ఎంపీపీ కార్యాలయంలో ఎన్నిక ప్రక్రియను అధికారులు నిర్వహించారు. మొదటగా నామినేషన్ దాఖలు చేయడానికి ఉదయం 10 గంటలకు చివరి కాగా అప్పటికే వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడు ఉమ్మడి నారాయణ రెడ్డి నామినేషన్ ఒకటే దాఖలైంది. అప్పటికి ఐదుగురు సభ్యులు హాజరయ్యారు. చివరి నిమిషంలో ఎన్నికల కమిషన్ ఆదేశమంటూ నామినేషన్ సమయాన్ని మరో గంట పాటు పొడిగించడం ఉద్రిక్త పరిస్థితికి దారి తీసింది. కార్యాలయం బయట ఉన్న టీడీపీ, వైఎస్సార్‌సీపీ మద్దతుదారుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. నామినేషన్ సమయం ముగుస్తుందనుకునే సమయంలో టీడీపీ మద్దతురాలు రాచగుడిపల్లి ఎంపీటీసీ సభ్యురాలు నల్గొండ లక్ష్మీదేవి దాఖలు చేసింది. ఎన్నికల ప్రక్రియకు ఎనిమిది మంది హాజరవ్వగా ఆమెకు ఐదు మంది ఎంపీటీసీల మద్దతు ఉండటంతో ఆమె ఎన్నికలో గెలిచినట్టు డీఎల్‌డీఓ సుబ్రమణ్యం ప్రకటించారు. టీడీపీకి ఒక సభ్యుడి బలం లేని చోట వైస్ ఎంపీపీ–1గా గెలిపించుకోవడంలో అధికార పార్టీ మండల నాయకులు పెద్ద మొత్తంలో నగదు ముట్టజెప్పినట్టు పెద్దెత్తున ప్రచారం జరిగింది. కాగా గతంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలలో మండలంలో మొత్తం 9 ఎంపీటీసీ స్థానాలు ఉండగా వైఎస్సార్‌సీపీ క్లీన్‌స్వీప్ చేసింది. చింతరాజుపల్లి ఎంపీటీసీ సభ్యుడు, వైస్ ఎంపీపీగా ఉన్న గడ్డం జనార్దన్ రెడ్డి మరణించడంతో గురువారం ఎన్నిక అనివార్యమైంది.

అన్నమాచార్యుల జీవితం చరిత్రాత్మకం



అన్నమాచార్యుల 522 వర్ధంతి వేడుకలలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆకేపాటి, నాయకులు

రాజంపేట రూరల్ : పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుల జీవితం చరిత్రాత్మకమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి కొనియాడారు. మండల పరిధిలోని కె.బోయినపల్లిలోని 108 అడుగుల అన్నమాచార్యుల విగ్రహం వద్ద వేడుకగా 522 వర్ధంతి వేడుకలు టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ వేడుకలలో భాగంగా గురువారం రాత్రి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ వేడుకలలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే ఆకేపాటికి వేద పండితులు ఘన స్వాగతం పలికారు. అన్నమాచార్యులకు ప్రత్యేకంగా పూజలు చేశారు. అనంతరం వేద పండితులు వేద మంత్రాలతో ఎమ్మెల్యే ఆకేపాటిని ఘనంగా సన్మానించారు. ఈ వేడుకలలో ఆకేపాటి వెంట వైఎస్సార్‌సీపీ మాజీ రాష్ట్ర మాజీ సంయుక్త కార్యదర్శి చొప్పా ఎల్లారెడ్డి, తాళ్లపాక సర్పంచ్ శంకరయ్య, ఎంపీటీసీ ఎ.మధుబాబు, మాజీ ఎంపీటీసీ కె.రెడ్డెయ్య, వార్డు మెంబర్ శివరాజు, నాయకులు జి.బాస్కర్, మల్లికార్జునరాజు, విశ్వనాథ్, నారయ్య యాదవ్ పాల్గొన్నారు.

పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి



మాట్లాడుతున్న ఏఎస్పీ మనోజ్ రామ్‌నాథ్ హెగ్డే, పాల్గొన్న సీఐలు కుళ్లాయప్ప, రాజా

రాజంపేట : పండుగలు మతసామరస్యానికి ప్రతీకలని రాజంపేట ఏఎస్పీ మనోజ్ రామ్‌నాథ్ హెగ్డే అన్నారు. స్థానిక ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సోదర భావంతో పరస్పరం పండుగలను జరుపుకోవాలన్నారు. ప్రశాంత వాతవరణంలో ఎవరి పండుగలను వారు జరుపుకోవాలన్నారు. పీస్ కమిటీ సభ్యులు నిర్వహించాల్సిన అంశాలను పక్కాగా అవగాహన కల్పించుకోవాలన్నారు. ఉగాది, రంజాన్ నేపథ్యంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసుశాఖ ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. అందరు ఐకమత్యంతో పండుగలను జరుపుకోవాలన్నారు. సమావేశంలో పోలీసులు, మత పెద్దలు, ప్రార్థనమందిరాల నిర్వాహకులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

ఈ-కేవైసీ తప్పనిసరి

సిద్దవటం : రేషన్ కార్డు కలిగిన వారు ఈ-కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని ఇన్‌చార్జి తహసీల్దారు మాధవీలత తెలిపారు. గురువారం తహసీల్దారు కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ రేషన్ కార్డులో ఉన్న కుటుంబ సభ్యులు ఈ-కేవైసీ నమోదు చేసుకోకుంటే పథకాలు రావన్నారు. ఈ – కేవైసీ చేయించుకోని వారు సమీపంలోని చౌకదుకాణం డీలర్ల వద్ద ప్రక్రియను పూర్తి చేయాలని చెప్పారు. 5 సంవత్సరాలు వయస్సు దాటిన పిల్లలు ఆధార్ సెంటర్లలోనూ ఈకేవైసీని చేయించుకోవచ్చన్నారు.

భక్తి శ్రద్ధలతో షబ్–ఏ–ఖదర్ ప్రార్థనలు



విద్యుత్ దీపాల అలంకరణలో దిగువపేటలోని అహ్మదీయ మసీదు

సిద్దవటం : ముస్లింలు అత్యంత పవిత్రంగా భావించే రంజాన్ మాసంలో వచ్చే షబ్–ఏ–ఖదర్‌కు ఎంతో ప్రత్యేక స్థానం ఉంది. అలాంటి వేడుకలను గురువారం రాత్రి భక్తి శ్రద్ధలతో ప్రార్థనలు నిర్వహించారు. ముస్లింలు మసీదులకు రంగులు, విద్యుత్ దీపాలతో అలంకరించి ముస్తాబు చేశారు. ఉపవాసాలు విరమించేందుకు ప్రత్యేకంగా ఇఫ్తార్ విందులను ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఆయా మసీదుల ఇమాంలు మాట్లాడుతూ పవిత్ర ఖురాన్ అవతరించిన రాత్రి అని, ఈ రోజు దేవదూతలు భూమిపైకి దిగి వస్తారనేది ముస్లింల ప్రగాఢ విశ్వాసమని ఆ సమయాల్లో ప్రార్థనలు చేస్తే వేయి రాత్రుల పుణ్యం లభిస్తుందనే నమ్మకంతో రాత్రంతా మసీద్‌లలో జాగరణ చేస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేస్తారన్నారు. మండలంలోని మసీదుల్లో జాగారం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రుబీనా

సుండుపల్లె : వడదెబ్బ తగలకుండా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ రుబీనా తెలిపారు. మండల పరిధిలోని రాయవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని కురవపల్లిలో వడదెబ్బపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆమె అవగాహన సదస్సును గురువారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎండలు ఎక్కువ ఉన్నందున ఉదయం వేళలో ప్రజలు పనులకు వెళ్లేటప్పుడు తప్పనిసరిగా గొడుగు వాడాలని పలుచని దుస్తులను ధరించాలన్నారు. అలానే తాగునీటిని తప్పనిసరిగా తీసుకువెళ్లాని తెలిపారు. వడదెబ్బ లక్షణాలు ఉంటే వెంటనే చల్లని ప్రదేశంలోకి తీసుకువచ్చి ఓఆర్ఎస్ ద్రావణం కొద్దికొద్దిగా తాపుతూ తరువాత ఆస్పత్రిలో చూపించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ వీరనారాయణ, సీహెచ్ఓ ప్రేమలత, ఏఎన్ఎం సౌజన్య, ఆశా కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

వైభవంగా నడివీధి గంగమ్మ జాతర



రసవత్తరంగా సాగుతున్న బండలాగుడు పోటీలు



రైల్వేకోడూరు అర్బన్‌: పూజలు చేయిస్తున్న నేతలు

ఒంటిమిట్ట : మండల కేంద్రంలోని నడివీధి గంగమ్మ జాతర గురువారం ఆలయ కమిటీ సభ్యులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురువారం తెల్లవారుజామున గంగమ్మ విగ్రహాన్ని చేసిన ఆచారి ఇంటి వద్ద నుంచి నడివీధిలో ఉన్న రాతి గంగమ్మ తల్లి ప్రాంగణం వరకు భక్తులు బలుల రూపంలో మొక్కులను సమర్పించుకుంటూ నడివీధిలో చేసిన ప్రత్యేక ఆలయానికి తీసుకొచ్చారు. అనంతరం ప్రత్యేకంగా చేసిన ఆలయంలో గంగమ్మ తల్లిని ఉంచి భక్తులు బోనాలు, కాయా కర్పూరం, పూలమాలలు అమ్మవారికి సమర్పించారు. అనంతరం గురువారం రాత్రి అమ్మవారి ఊరేగింపులో చాందినీ బండ్లు భక్తులను అలరించాయి. మధ్యాహ్నం జరిగిన బండలాగుడు పోటీలు రసవత్తరంగా సాగాయి. విజేతలకు ఉత్సవ నిర్వహణ కమిటీ సభ్యులు బహుమతులు అందజేశారు.

కోడూరులో..

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని ప్రధాన రహదారిలో వెలసిన బలిజపల్లి గంగమ్మకు గురువారం వైభవంగా జాతర, పొంగుబాలు ప్రజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, ఉపసర్పంచ్ తోట శివసాయి, సీహెచ్ రమేష్, మండల నాగేంద్రలు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం 5 గంటల నుంచి సంప్రదాయబద్ధంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి జాతర చేశారు. అనంతరం మహిళలు గంగమ్మకు పొంగుబాలు సమర్పించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహించారు. అలానే మండలంలోని పలు గ్రామాల్లో గంగమ్మ జాతరను వైభవంగా జరుపుకున్నారు.

ఎమ్మెల్యే ఆకేపాటిని విమర్శించే స్థాయి నీది కాదు

ఒంటిమిట్ట : రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డిని విమర్శించే స్థాయి మేడా విజయ శేఖర్ రెడ్డికి లేదని జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి అన్నారు. మండలంలో గురువారం జరిగిన వైస్ ఎంపీపీ–1 ఉప ఎన్నిక అనంతరం టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయ శేఖర్ రెడ్డి రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డిపై చేసిన విమర్శలకు విలేకరుల సమావేశం ద్వారా ఇరగంరెడ్డి దీటుగా కౌంటర్ ఇచ్చారు. మేడా బ్రాండ్‌ని ఢిల్లీ వరకు తీసుకెళ్లిన సత్తా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి దక్కుతుందన్నారు. ఆకేపాటి రెండు సార్లు ఎమ్మెల్యే, ఒకసారి జెడ్పీ చైర్మన్ అయినా ఆయన్ను వార్డు మెంబర్‌గా కూడా పోటీ చేయని నువ్వు విమర్శించడం నీ స్థాయి కాదన్నారు. వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలకు ప్రలోభపెట్టి ఎన్నికల్లో టీడీపీ ఓటు వేయడాన్ని మండల ప్రజలు చూశారని చెప్పారు. ఒక ఎంపీటీసీ లేని మండలంలో వైస్ ఎంపీపీ స్థానాన్ని ఏ విధంగా గెలిచారో అందరికి తెలుసన్నారు. దీన్ని విజయంగా భావించడం మూర్ఖత్వమని అన్నారు. మండలంలో వైఎస్సార్‌సీపీ ఎంత బలంగా ఉందో గత ఎన్నికల్లో మా పార్టీ అభ్యర్థులకు వచ్చిన మెజార్టీని తెలుసుకోవాలన్నారు. ఆకేపాటి గురించి అవాకులు చవాకులు పేలితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో రాజంపేట నియోజకవర్గ వైఎస్సార్ సిపి యూత్ వింగ్ అధ్యక్షుడు కూండ్ల ఓబుల్‌రెడ్డి, మండల వైఎస్సార్ సిపి అధ్యక్షులు టక్కోలు శివారెడ్డి, కొండమాచుపల్లి సర్పంచ్ మేరువ శివ నారాయణ, కొత్తమాధవరం ఉప సర్పంచ్ మురళీ తదితరులు పాల్గొన్నారు.

అడవికి ఆకతాయిల నిప్పు



మంటలను ఆర్పే ప్రయత్నం చేస్తున్న అటవీ సిబ్బంది

సిద్దవటం : ఆకతాయిలు అడవికి నిప్పు పెట్టడం వల్ల అడవి కాలిపోడవంతో నష్టాలు జరుగుతాయని సిద్దవటం రేంజర్ బి. కళావతి తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆమె మాట్లాడుతూ సిద్దవటం రేంజిలోని గొల్లపల్లె బీటులో బుధవారం గుర్తు తెలియని వ్యక్తులు అడవికి నిప్పు పెట్టడం వల్ల చాలా నష్టాలు జరుగుతాయన్నారు. ఎండలు తీవ్రంగా ఉండటం వల్ల అడవికి నిప్పు పెడితే అటవీ శాఖ, అధికార సిబ్బంది మంటలను ఆర్పడం తలకు మించిన భారమవుతుందన్నారు.

నిరుపేదలకు సహాయం చేయడంలోనే సంతృప్తి



రాయచోటి అర్బన్‌: రంజాన్ తోఫాను పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ చిల్లీస్ ఫయాజ్‌బాషా



రాయచోటి అర్బన్‌: పేదలకు దుస్తులను అందజేస్తున్న బేపారి మహమ్మద్‌ఖాన్



రాజంపేట టౌన్‌: చీరలు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు మహబూబ్‌బాషా



గాలివీడు: చీరలు పంపిణీ చేస్తున్న మాజీ సర్పంచ్

రాయచోటి అర్బన్ : నిరుపేదలకు సహాయం చేయడంలోనే అసలైన సంతృప్తి లభిస్తుందని మున్సిపల్ చైర్మన్ చిల్లీస్ ఫయాజ్ బాషా అన్నారు. బుధవారం రాత్రి పట్టణంలోని మహబూబ్‌నగర్ జీనత్ మసీదు వద్ద 45 మంది నిరుపేదలకు జరియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సిద్ధంగా ఉంచిన రంజాన్ తోఫాను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా సమయంలో సైతం జరియా ఫౌండేషన్ సభ్యులు ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టారన్నారు. అందరిలాగే నిరుపేదలు కూడా రంజాన్ పండుగను సంతోషంగా జరుపుకోవాలనే ఉద్దేశంతో తోఫాను పంపిణీని చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జరియా ఫౌండేషన్ చైర్మన్ ఖీజర్, సభ్యులు షబ్బీర్, జిలాన్, రియాజ్, మక్బూమ్, మస్తాన్, మౌలాలి, నవాజ్, గౌస్‌తో పాటు జీనత్ మజీద్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ ఆధ్వర్యంలో..

గాలివీడు : ముస్లిం మైనారిటీల పవిత్ర పండుగ రంజాన్ పురస్కరించుకొని బోరెడ్డిగారిపల్లి మాజీ సర్పంచ్ దంపతులు ఆలియాభాను, మహమ్మద్ రఫీల ఆధ్వర్యంలో మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ప్రతీ ఏటా తమ తండ్రి పకీర్ సాబ్ జ్ఞాపకార్థం పంచాయతీలోని బోరెడ్డిగారి పల్లి, సుగాలి తండా, భక్కిరెడ్డిగారిపల్లి, గొందిపల్లెల్లో సుమారు 600 మంది మహిళలకు చీరలు పంపిణీ కార్యక్రమాన్ని చేపడుతున్నారు. గురువారం పెద్ద రాత్రి సందర్భంగా కుల మతాలకతీతంగా మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వారి తల్లి బసిరున్నీసా, సోదరులు మన్సూర్ మాలిక్ తదితరులు పాల్గొన్నారు.

పేద మహిళలకు చీరలు పంపిణీ

రాజంపేట టౌన్ : రంజాన్ పండుగను పురస్కరించుకొని గురువారం వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు షేక్ మహబూబ్‌బాషా పట్టణంలోని బలిజపల్లె రోడ్డులో 250 మంది పేద మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహబూబ్‌బాషా మాట్లాడుతూ పేదలు సైతం నూతన దుస్తులు ధరించి రంజాన్ పండుగను ఆనందంగా జరుపుకోవాలని ప్రతి ఏడాది చీరెలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అల్లాహ్ కృపవల్లే పవిత్ర రంజాన్ మాసంలో పేదలకు తనవంతు సహాయం చేసే అవకాశం కలిగిందన్నారు. రంజాన్‌ను ముస్లింలందరూ సంతోషంగా జరుపుకోవాలని ఈసందర్భంగా ఆకాంక్షించారు.

రంజాన్‌ను సంతోషంగా జరుపుకోవాలి

రాయచోటి అర్బన్ : పవిత్రమైన రంజాన్ పండుగను ముస్లిం సోదరులంతా సంతోషంగా జరుపుకోవాలని వైఎస్ఆర్‌సీపీ అన్నమయ్య జిల్లా మైనార్టీ విభాగం అధ్యక్షుడు బేపారి మహమ్మద్‌ఖాన్ అన్నారు. గురువారం పట్టణంలోని తన గృహం వద్ద ఆయనను పేద ముస్లిం, మైనార్టీలకు చీరలు, బట్టలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ పండుగ క్రమశిక్షణను, దాతృత్వాన్ని, ధార్మిక చింతనను ప్రజలకు అలవరుస్తుందన్నారు. తమ తండ్రి కాలం నుంచే ప్రతియేటా పేదలకు కుల, మతాలకతీతంగా బట్టలను పంపిణీ చేయడం జరుగుతోందన్నారు. మనం సంపాదించిన సంపదలో కొంత పేదలకు పంచాలని(జకాత్) ఖురాన్ చెబుతోందన్నారు. కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ రాయచోటి యువజన విభాగం సెక్రటరీ బేపారి జబీవుల్లాఖాన్, అర్షద్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ సివిల్ జడ్జిగా తేజస్విని

రాయచోటి : రాయచోటి జూనియర్ సివిల్ జడ్జిగా ఎన్.తేజస్విని గురువారం బాధ్యతలు చేపట్టారు. హైకోర్టు ఉత్తర్వులు మేరకు గురువారం కోర్టు ఛాంబర్‌లో ఆమె బాధ్యతలను తీసుకున్నారు. స్థానికంగా పనిచేసిన న్యాయమూర్తి శారద విశాఖపట్నం బదిలీ కావడంతో ఈ స్థానం ఖాళీ ఏర్పడింది. బాధ్యతలు చేపట్టిన న్యాయమూర్తి తేజస్వినికి కోర్టు సిబ్బంది పోలీసులు న్యాయవాదులు శుభాకాంక్షలు తెలిపారు.

31, 1న మంచాలమ్మ జాతర

రామాపురం : మండలంలోని రాచపల్లె పంచాయతీ గంగనేరు గ్రామంలో కొలువైన శ్రీ మంచాలమ్మ జాతర మహోత్సవం ఈనెల 31, ఏప్రిల్ 1న జరుగుతుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. 31న నిండు తిరునాలు, 1న మైలు తిరునాల ఉత్సవం జరుగుతుందన్నారు. కొవ్వూరు వంశీకుల ఇలవేల్పు అయిన మంచాలమ్మకు సదరు వంశీకులతో పాటు గ్రామస్తుల ఆధ్వర్యంలో జాతర నిర్వహిస్తారు. కొవ్వూరు వంశీస్తులు అమ్మవారికి విశేష పూజలు, సారెతో పాటు పట్టువస్త్రాల శాస్త్రోక్తంగా సమర్పిస్తారు. అమ్మవారికి పూజల అనంతరం సర్వాంగ సుందరంగా పట్టువస్త్రాలతో అలంకరిస్తారు. భక్తులు విశేషంగా పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులవుతారు. పోలీసులు గట్టి బందోబస్తును ఏర్పాటు చేయనున్నారు.

గుండెపోటుతో యువకుడు మృతి

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని కొత్తకోడూరు గంగమ్మ గుడి వ్యవస్థాపక చైర్మన్ చెన్నంశెట్టి కుమార్ (35) గురువారం తెల్లవారుజామున బలిజపల్లి గంగమ్మ జాతరలో భాగంగా ఉత్సవం జరుగుతుండగా గుండెపోటుతో మృతి చెందాడు. స్థానిక గిరిజమ్మ వీధిలో నివాసముంటున్న కుమార్ విద్యుత్ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ప్రముఖులు, స్థానికులు, స్నేహితులు మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. మృతుడికి భార్య సుమ, ఇద్దరు కుమారులు ఉన్నారు.

వేంకటేశ్వర స్వామికి పూజలు

సంబేపల్లె : మండల పరిధిలోని దుద్యాల వడ్డిపల్లెలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవంలో భాగంగా ఆలయాన్ని పూలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. స్వామి వారి మూలవిరాట్‌కు పూజలు, అభిషేకాలు గావించారు.

అర్బన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పై చర్యలు తీసుకోవాలి

రాజంపేట రూరల్ : పని ప్రదేశంలో గాయపడి ఇంటి యజమానిపై కేసు నమోదు చేసి న్యాయం చేయాలని పోలీసులను ఆశ్రయించిన కార్మికురాలు క్రిష్ణమ్మపై చేయి చేసుకోవడమే కాక దూషించిన అర్బన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌పై ఉన్నత స్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు గాలి చంద్ర డిమాండ్ చేశారు. మండల పరిధిలోని ఎస్.ఎర్రబల్లిలోని ఏఎస్పీ కార్యాలయం వద్దకు గురువారం చేరుకున్న భవన నిర్మాణ కార్మికులు ఏఎస్పీ మనోజ్ రామ్‌నాథ్ హెగ్డేకి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్‌టీఆర్ కాలనీలో కిషోర్‌కుమార్‌రెడ్డి ఇంటి నిర్మాణ పనులు చేస్తూ కృష్ణమ్మ అనే కార్మికురాలు భవనం పై నుంచి కింద పడిందన్నారు. తల తీవ్ర గాయాలు కావడంతో ఆమెకు రిమ్స్‌లో 20 కుట్లు వేశారన్నారు. క్రిష్ణమ్మకు న్యాయం చేయమని అడిగేందుకు బుధవారం సాయంత్రం వెళ్లగా బండ బూతులు తిడుతూ తనపైన చేయి చేసుకున్నాడని తెలియజేశారు. సమస్యల పరిష్కారం కోసం పని చేస్తున్న నాయకులను పోలీస్ స్టేషన్‌లో అవమానించడం హేయమైన చర్య అని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు శుక్రవారం ఉదయం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఇతర సంఘాలతో కలిసి నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఇ.సికిందర్, నాయకులు నరసింహులు, మహమ్మద్ హుస్సేన్, నాగేశ్వరరావు, రమణ, వెంకటసుబ్బయ్య, మల్లికార్జున, రాజు, జమాల్, సురేష్, వెంకటేశు, కేశవ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాప్టో జిల్లా నూతన కమిటీ ఎంపిక



నూతనంగా ఎంపికైన ఫ్యాప్టో జిల్లా కమిటీ కార్యవర్గం

రాయచోటి అర్బన్ : పట్టణంలోని ఎస్టీయూ భవనంలో ఫ్యాప్టో జిల్లాస్థాయి సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నూతన జిల్లా కమిటీ ఎంపిక చేశారు. కమిటీ నూతన జిల్లా చైర్మన్‌గా ఎస్.జాబీర్, సెక్రటరీ జనరల్‌గా గఫార్‌ఖాన్, కో–చైర్మన్‌లుగా ఆర్.రవిశంకర్, శివారెడ్డి, సిబాతుర్ రహిమాన్, డిప్యూటీ సెక్రటరీ జనరల్‌గా మధుసూదన్, హరిబాబు, మహమ్మద్ ఇలియాస్‌లు ఎన్నికయ్యారు. అలాగే కార్యదర్శులుగా శ్రీనివాసులు, రెడ్డెప్పరెడ్డి, సుధాకర్ నాయుడు, జిల్లా కోశాధికారిగా జాఫరుద్దీన్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఫ్యాప్టోజిల్లా కమిటీ చైర్మన్ జాబీర్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం ఫ్యాప్టో ఆధ్వర్యంలో అవిశ్రాంతంగా పోరాటం చేయనున్నట్లు చెప్పారు. ఉపాధ్యాయుల హక్కుల పరిరక్షణ కోసం పోరాడుతామన్నారు. ఫ్యాప్టో రాష్ట్రశాఖ ఇచ్చే కార్యాచరణను విజయవంతం చేయడానికి ప్రయత్నం చేస్తామన్నారు.

డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

రామాపురం : మెగా డీఎస్సీ ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ప్రభుత్వం ఉచిత శిక్షణ ఏర్పాటు చేసిందని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు వెంకటరమణ తెలిపారు. గురువారం మండల కేంద్రంలో విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సాంఘిక సంక్షేమ శాఖ, గిరిజన శాఖల ద్వారా అభ్యర్థులకు ఉచిత వసతి, భోజనాది సదుపాయాలతో డీఎస్సీ పరీక్షకు శిక్షణ ఇస్తుందన్నారు. ఉచిత కోచింగ్‌కు జ్ఞానభూమి పోర్టల్ వెబ్ ఎంపికలు షార్ట్ లిస్టు చేసిన అర్హులందరూ ఫేజ్–2లో వెబ్ ఆప్షన్‌ను 28వ తేదీలోపు పూర్తి చేయాలని తెలియజేశారు. ఈ అవకాశాన్ని డీఎస్సీకి సన్నద్ధం అవుతున్న వారు సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు.